# తాజ్‌మహల్లైనదా?

వాకాటి పాండురంగరావు

ఇటుకమీద ఇటుక.

చెమటమీద చెమట.

రూపాయమీద రూపాయ.

నల్లరూపాయమీద నల్లదే ఇంకో రూపాయ.

ఇటుకమీద రూపాయమీద చెమటమీద—

రూపాయల ఇటుకలతో చెమటల సిమెంటుతో—

లేస్తున్నాయి గోడలు....

లేస్తున్నాయి గదులు....

లేస్తున్నది మేడ పాముపడగలా.

ఆ పాము పడగనీడను బెకబెకలు, పకపకలు ; ఎన్నో ఎన్నో కప్పలు, వెంకప్పలు.

ఆ మేడను కడుతూ వెంకప్పలు, నారయ్యలు, గంగమ్మలు, పుల్లయ్యలు, ఎల్లమ్మలు.........వారిపేరు లేమయితేనేమి గాని కావలసిందల్లా వారి చెమట. దాని ఖరీదు రోజుకు రెండు రూపాయలన్నర....ఆడదయితే అర్ధరూపాయ తక్కువ.

ఆ మేడను కట్టెడివాడు, ఓయబ్బో! చాల పెద్ద సోషలిస్టు! కట్టించెడివాడు ఇంకో వీర సోషలిస్టు.

సో-గారు రాజ్యమేలుతుంటారు .... వీర సో-గారు కంట్రాక్టులు చేస్తుంటారు. వారున్నూ వీరున్నూ కలిసే ఈ స్వాతంత్ర్యానంతర భారతనారిని గోడలతో, మేడలతో, నీడలతో, సుసంపన్నం చేశారు. వాళ్ళేవో కొన్ని మేడలు కట్టుకుంటే కట్టుకున్నారు గాక, ఆ కట్టించడంద్వారా ఎన్నో వేలాది ఎల్లయ్యల పుల్లయ్యల దుర్గమ్మల మల్లమ్మలను పోషించలేదా ఏమిటి? ఎల్లయ్యలూ మల్లమ్మలూ వున్నంతకాలం, వారిని పోషించేటి సోషయ్యలూ, వీరసోషయ్యలూ వుండేటట్లు ఏర్పాటుచేసిన ఆ దేవుడు నిజంగా కరుణామయుడు.

లేస్తున్నది మేడ.

సిమెంటు కలిపే యంత్రాల హోరు, కాంక్రీటును కక్కే యంత్రాల గోడు, క్రేన్‌ల చప్పుళ్ళు, కూలివారి కేకల కోలాహలంలో, రొదలో లేస్తున్నది మేడ.

గౌరవనీయులు, వీధి కుళాయిల శాఖ మాత్యులవారు పునాదిరాయి వేసి, అయిదో వారం తిరక్కుండానే మూడో అంతస్తు నందుకుంది మేడ.

మేడను కడుతూ వందలాది కూలీలు.

ఆ కూలీలలో ఒకడు పెంచలయ్య.

ఆ మేడ లేస్తున్న అయిదెకరాల ఆవరణ అంచున ఎన్నోయెన్నో గుడిసెలు.

ఆ గుడిసెలలో ఒకటి పెంచలయ్యది.

ఆ గుడిసె లోపల—

ఆ గుడిసె లోపల పెంచలయ్య ప్రాణం వుంది. ఆమె సీతాలు.

ఆ గుడిసె లోపల పెంచలయ్య చీకటి పాలిటి వెన్నెల వున్నది. అది సుబ్బి.

పెందలకడనే మంచి బాలునివలె లేచి పనిలోకి వెళ్ళేవాడు పెంచలయ్య.

అతడితోబాటే సీతాలూ వెళ్ళేది. మళ్ళీ వచ్చేసరికి రాత్రి స్వాగతం పలికేది.

రోజంతా కష్టపడి పనిచేసి, కలిసి పనిచేసి, కబుర్లాడుతూ పనిచేసి, నవ్వుకుంటూ పనిచేసి, సాయంకాలం గుడిసె చేరాక, సీతాలు ఇంత ఉడకేస్తుండగా పెంచలయ్య వెల్గించిన చుట్ట వదలిన పొగలు అపోలో 71 లో ఆకాశానికి నిచ్చెనలు వేస్తే ఆ గుడిసె ముంగిట ఆనందవనం విరిసేది. ఆ నందన వనంలో పారిజాతం మొక్క సుబ్బి.

అయ్యలందరూ, అమ్మలందరూ మేడకట్టే పనిలోకి వెళ్ళిపోతే సుబ్బీ, వీరిగాడూ, ఎల్లమందా, లచ్చీ, కాశీ అందరూ కలిసి ఆ మట్టిలో, ఆ ధూళిలో, ఆ బురదలో ఆడుకునే వారు. ఇసుకతో ఇళ్ళు కట్టేవారు. రాళ్ళతో అన్నం వండుకునేవారు. ఆకులలో విందు భోజనాలు చేసేవారు. నెత్తిన మట్టి పోసుకునే వారు. శివతాండవం చేసేవారు. ఏ మేస్త్రీయో వచ్చి కసిరితే పారిపోయి ఇంకో మూల తమ ప్రపంచాన్ని సృష్టించుకునేవారు....

....ఒకనాడు పనిచేస్తూండగా సీతాలు ఎడమకాలి మడమమీద చిన్నదూలం పడింది. గాయమయింది. వాచింది. ఆ రోజుకు సీతాలు ఇక పనిచేయలేక మానుకుంది. ఆచోట పసుపురాచి పూసింది. సున్నంపట్టు వేసింది. మరునాటికి వాపు తగ్గలేదు, కాపడం పెట్టింది. కాని పనిలోకి వెళ్ళలేకపోయింది మూడో నాటికి ఉసిరికాయంత వాపు బత్తాయి పండంతయింది.........సలపడం, నొప్పి, బాధ, మూలుగు....

సీతాలు గాయానికి పెంచలయ్య విలవిలలాడాడు. కాని ఆమెను విడిచి పనిలోకి వెళ్ళక తప్పలేదు. రోజుకు నాలుగున్నర రూపాయలు వచ్చేవి. ఇప్పుడు రెండున్నర



రూపాయిలే వస్తుంది. ఆ నాలుగున్నర రూపాయిలో ఒక రూపాయ—అంతకు ముందునెల పుచ్చుకున్న డెబ్బయిరూపాయల అప్పుక్రింద రోజూ తగ్గించేవాడు మేస్త్రి. ఆ బాబు కాళ్లా వేళ్లా పడి బ్రతిమిలాడితే, సీతాలు పని మానిందగ్గరనుండీ ఆ రూపాయి కోతనా పడ్డాని కొప్పుకున్నాడు ధరవాత్ముడు—

వారంరోజులకు సీతాలుకు మాంచి జ్వరం వచ్చేసింది. అంతవరకు ఏమీ పట్టించుకో కుండా వీధిలో ఆడుకుంటూండిన సుబ్బికూడా అమ్మను చూచి ఏడుస్తూ కూచోసాగింది.

సీతాలుకు ఆస్పత్రంటే భయం. చచ్చేంత భయం. వాళ్ళమ్మ ఆస్పత్రికెళ్ళాకనే చని పోయింది. వాళ్ళ బాబయ్య ఆస్పత్రిలోనే చచ్చాడు. చచ్చేవాళ్ళే ఆస్పత్రికి వెళ్తారన్న నమ్మకం సీతాలు మనసుమీద కాంక్రీటు లాగా బిగుసుకుపోయింది. చచ్చినా సరే ఆస్పత్రి గుమ్మం తొక్కనని ఏనాడో చెప్పి వుంది. మళ్ళీ చెప్పింది. మందులేక ప్రాణం పోయినా సరే....ఆస్పత్రికి వెళ్ళనంది అంతే.

పెళ్ళానికి జబ్బు. బిడ్డ ఏడుపు. డబ్బుకు కటకట. మనసుకు అలసట. శరీరానికి అలసట.

పెంచలయ్య స్వర్గం నరకమయింది.

అయినా పని మానేయలేడు కదా—పని మానేస్తే ఆ కాస్త గంజినీళ్ళకు కరువయి పోతుంది, సుబ్బితల్లి విలవిలలాడుతుంది. మొన్ననగా మొన్న మరమరాలకు పదిపైస లడిగితే ఇవ్వలేకపోయెనే తను....వెధవ జన్మ....

పెంచలయ్య ఆ పెద్ద వీధిలోనే ఒక పెద్ద డాక్టరు దగ్గరకు వెళ్ళి అడిగితే ''పాతిక రూపాయలు పట్టుకొచ్చినావా?'' అని అడిగాడు.

నోట మాట రాలేదు పెంచలయ్యకు.

నాలుగయిదు వీధులు తిరిగి తిరిగి చివరికి ఓ చిన్న డాక్టరు—వయస్సుకు చిన్నకాదు, సైజులో చిన్నకాదు—డిగ్రీలో 'చిన్న' డాక్టరు—ఎంబీ బిఎస్సు కాక ఆరెంపీ కల వాడూ ఆయిన డాక్టరును బ్రతిమిలాడితే ఆయన వచ్చి సీతాలును చూచాడు.

చూచి—''సెప్టిసీమియా సెట్ ఇన్ అవుతుందోయ్'' అన్నాడు.

పేరేదయితేనేమి, అది నా ప్రాణానికి యమపాశం—అనుకున్నాడు పెంచలయ్య.

డాక్టరుగారు సూది మందు వేశారు. మరో రెండురూపాయల మాత్రలు రాసిచ్చారు.

ఆ రోజు రోజంతా పెంచలయ్య సీతాలు పక్కనే కూచున్నాడు. ఆమె ఒళ్ళుతెలియని జ్వరంలో వుంది....

అయిదేళ్లక్రింద తాను తన మామయ్య కాలు విరిగితే, తిరపతిదగ్గర స్వగ్రామం నుండి పుత్తూరుదగ్గర ఈశలాపురానికి వైద్యం నిమిత్తం వెళ్లాడు.

ఆమెది కాళహస్తి. ఆమె నాన్న మోచేతి ఎముక విరిగిందని అక్కడికి తీసుకువచ్చారు.

అక్కడ తారసిల్లింది సీతాలు.

చూపులు కలిశాక మనసులు వెనకబడ లేదు. ఎముకలు అతికేచోట మనసులు అతి కారు. పెద్దలు సరేనన్నారు.

ఆ ఏడుకొండల వెంకన్న ఎదుట తనూ సీతాలూ ఒక యింటివారయ్యారు. నిలవ్వేసి వుంచిన డబ్బుతో కాళహస్తి, తిరుత్తణి, మద రాసు—యిట్లా చెట్టా పట్టాలేసుకొని తిరిగారు. యిష్టం వచ్చినన్నాళ్ళు ఇష్టం వచ్చిన చోట వున్నారు. ఎక్కడ పని దొరికితే అక్కడ పనిచేసుకుని నాలుగు రూపాయలు సంపా దించుకునేవారు. గలగలమని సెలయేరై పారింది వారి జీవితం. ఏడాది కాగానే సుబ్బి తల్లి ఉదయించింది. దాన్తో వారి జీవితాలకో అర్థం ఏర్పడింది.

కాని ఈ నాలుగేళ్ళల్లో ఏమయింది.... ఏదో అయింది .... పొట్టచేత్తో పట్టుకుని వూరూరూ తిరుగుతున్నారు. రెక్కలు వంచి శ్రమించి పొట్టనింపుకుంటున్నారు. ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూస్తేచాలు—ఆ కష్టమంతా తీరిపోయేది...కాని కడుపులో ఆకలి...పెరుగు తున్నపిల్ల...పెరుగుతున్న ఖర్చులు...తరుగు తున్న డబ్బు విలువ....యివన్నీ కలిపి సుఖాన్నీ, సుఖంగా వుండినకాలాన్నీ—పూర్వ జన్మలోనేమో అన్పించేటట్లు చేశాయి.

....ఆ స్వర్గానికీ ఈ నరకానికీ మధ్య పెంచలయ్య మనసు ఊగిసలాడింది....ఆ రాత్రంతా మూలుగుతూనే పడుకుంది సీతాలు.

మరునాడు యధాప్రకారం పెంచలయ్య పనిలోకి వెళ్ళాడు.

ముందు ప్రక్కమేడ పైకి పైపైకి లేస్తుంది. వెనక ఆవరణలో కార్ల గ్యారేజిల

కోసం నాల్గంతస్తుల భవంతి లేవనున్నది. ఆ భవంతి కోసం ధనాధన్, ధనాధన్ మని భూతంలాటి యంత్రం—అరవై అడుగుల ఎత్తుది—పదివేల మరల చేతులది—లావు పాటి పొడుగాటి కాంక్రీటు స్తంభం నెత్తి మీద మొట్టి మరీ నేలలోకి దింపుతున్నది. దాని దెబ్బదెబ్బకు ఆ చుట్టుప్రక్కల మేడలన్నీ వణుకుతున్నాయి. కూలి జనం అంతా గుంపులు గుంపులుగా చీమల బారులవలె తిరుగున్నారు. చీమలకూ వారికీ ఒకటే తేడా —చీమలలో కంట్రాక్టరుండడు.

ఆ చీమలలో చీమ — పెంచలయ్య— గతాన్ని తలచుకుంటూ వర్తమానంలో పని చేస్తున్నాడు. ఇంటిదగ్గర ఇల్లాలు—జబ్బుతో ఇల్లాలు—డబ్బు దాహంగల జబ్బు—డబ్బుల్లేని తను—యివన్నీ తెలియక మట్టిలో వీధిలో—ఆడుకుంటున్న సుబ్బి తల్లి ....

మేస్త్రీగారితో చెప్పి కంట్రాక్టరు బాబు నుండి యాభయి రూపాయిలు అడ్వాన్స్ పుచ్చుకుంటేనో....

ఆశ వెలిగింది పెంచలయ్య ఎదలో.... వెంటనే వచ్చింది. ఎలాగిస్తాడు. ఎందుకిస్తాడు. ఇంతకు ముందరి అడ్వాన్సు తీరక పోయెనే యింకో నలభై పై చిలుకుండేనే అందులోనూ సీతాలు జబ్బు పడ్డనాటి నుండి ఆదాయం సగమయింది. ఖర్చు నాలుగింతలయింది. వచ్చే దీపావళికి సుబ్బి కొక గౌను కొందామంటే లేకపోయేనే. రూపాయిపెట్టి మతాబాపుల్లలు, కాకరపువ్వొత్తులు వెలిగిద్దామంటే కుదరదేమోనే. ఛీ ఛీ.... వెధవ జన్మ .... వెధవ జన్మ.... చేతకాని జన్మ.... పూర్వ జన్మలో యెవరికేమి అన్యాయం చేశాడో తను.... ఈ జన్మలో తాను కష్టపడడమే కాకుండా పెళ్ళాన్ని బిడ్డను కూడా కష్టపెడుతున్నాడు. పెళ్లాం తల నొప్పితో బాధ పడుతుంటే మందిప్పించలేని జన్మ తనది. రెండు బత్తాయిపళ్ళు కొనివ్వలేని జన్మ, ఒక్కగానొక్క పిల్ల మొక్కజొన్న పొత్తులడిగితే ముందు వెనక లాలోచించే జన్మ—

దుఃఖం లావాలా పొంగి పోతున్నది. నిరాశ నిప్పై రాజుకుంటున్నది. మనస్సు తడిపిన గొల్లసున్నమై ఉడుకుతున్నది. కాళ్లు నడుస్తున్నాయి. చేతులు తట్టలు మోస్తున్నాయి.

ఆ రాత్రి సీతాలు పరిస్థితి అధ్వాన్నమయింది. ఇంజక్షన్ యిచ్చి ఆయిదు రోజులయింది. కాలివాపు తగ్గకపోగా ఇంజక్షన్ యిచ్చినచోట వాచింది. ఆ వాపు పెద్దదయింది. అయిదు ముడి నుండి తలో రూపాయా అప్పడిగి తీసుకుని పెంచలయ్య 'ఆ రెంపీ' గారిని పిలిస్తే ఆయన వచ్చి—"ఆప్సిస్" అన్నాడు. కోయాలన్నాడు. కోయడానికి పాతికన్నాడు. చిల్లర ఖర్చులింకో పాతికన్నాడు.

పిడుగు పడింది పెంచలయ్య నెత్తిమీద.

రూపాయకు దారిలేని వాడికి యాభై ఎలా వస్తుంది. ఈ వాపేమిటి—ఆ గాయమేమిటి —ఆపరేషనేమిటి—దేవుడా ఇది నీకు ధర్మమా మా రాజులనుకున్నావా ఏమిటి—ఇట్లాటి గత్తరంతా తెచ్చి మా నెత్తిన పడేయడానికి.

—మేస్త్రీబాబూ, నువ్వే కాపాడాలి— నువ్వే ఆదుకోవాలి—'

—పోరా పో—వేరేంపన్లేమూ నీలాటోళ్ళు నాల్గువందలమంది వున్నారు. అందరికీ ఏదో అవసరం వుండనే వుంటుంది. ఎవరికిచ్చేది. ఎవరికి మానేది. ఇక్కడేం చెట్లున్నాయా రూపాయలు కోసుకోవడానికి పో.... పో—

ఆ రాత్రల్లా సీతాలు అరుపులు.... కుయ్యో మొర్రో.... కాలి వాపు బాధ ఇంజెక్షన్ బాధ. ఆప్సిస్ బాధ.... శరీరం బాధ.

ఆమె ప్రతీ అరుపు పెంచలయ్యకు కత్తి పోడుపు. విలవిల తన్నుకున్నాడు. ఆమెను పొదివి పట్టుకున్నాడు. అంత యాతనలోనూ ఆమె అతడి కన్నీరు తుడిచింది.

"బాగయిపోతుంది మామా. నాకు బాగయి పోతుంది" అని సముదాయించింది.

పెంచలయ్య బావురుమన్నాడు.

అయ్యో—అంది మళ్ళీ నొప్పితో సీతాలు.

ఆ మర్నాడుదయం—పెం చ ల య్య లేవాడు.

ఇవాళెలాగయినా ఆ డబ్బు సంపాదించాల్సిందే. జేబులయినా కొట్టి, దొంగతనమయినాచేసి, భిక్షమయినా ఎత్తి ఆ యాభై తేవలసిందే. తన ప్రాణమయిన సీతాలు నొప్పి తగ్గించవలసిందే. ఇంకొక్క రోజు సీతాలు అట్లా బాధపడితే తానింక బ్రతకడం దండుగ.

పెంచలయ్య శరీరం ఆ మేడదగ్గర పని చేస్తున్నా, మెదడు ఎన్నో నరకాలను పలకరించి వస్తున్నది.

"ఏందిరోయ్—ఆ సిమెంటు తట్టను అక్కడ బోర్లించావేం.... నీ యబ్బసొమ్మనుకున్నావా.... " అరిచాడు మేస్త్రీ—ఎక్కడో పోయవలసిన సిమెంటు నింకెక్కడో పోసిన పెంచలయ్యతో—

పెంచలయ్య పళ్ళు బిగపట్టుకుని పనిచేస్తున్నాడు. చెమటలు కురుస్తున్నాయి. యంత్రాలు పనిచేస్తున్నాయి. చెమటలు కురవకుండా క్రేన్లు పెళ్ళి పందిరిలో ఆడపెళ్ళి వారిలా క్రిందకూ పైకీ హడావిడిగా వెళ్తూ వస్తున్నాయి. ఆ నిర్మాణ తీర్థంలో కూలీ యాత్రికుల కోలాహలం రైల్వే జంక్షన్ హడావిడి యంత్రాల గరగర క్రేన్ల జరజర పెంచలయ్యకు చెర.... చెర.

ఎవరో అరిచారు.

"పెంచలయ్యా...."

అదిరిపడ్డాడు పెంచలయ్య. గుండె ఆగింది అరక్షణం సీతాలుకు....?

"పెంచలయ్యా! రోడ్డుమీదకు పరుగెత్తుకు వెళ్లు. మీ అమ్మాయి సుబ్బి...."

బాణంవలె దూసుకు పోయాడు పెంచలయ్య.

జనం జనం.... ఏమయిం దేమయింది.... నా చిట్టి తల్లికి.... నా చిన్నారి పూలమొక్కకు నా బుజ్జి దీపానికి నా రేపటి పున్నమికి ఏమయింది దేవుడా ఏమయింది. నా మాణిక్యాన్ని, నా రత్నాల తల్లికి ఏమయింది—

ఆ మేడముందరి పెద్దవీధిలో ఆడుకుంటున్న సుబ్బితల్లి వీధి ఆ వైపునుంచి ఈ వైపుకు పరుగెత్తుకు వస్తూంది. రయ్యమని వచ్చిన కారుకు 'క్రీ....క్' మని బ్రేక్



పడింది....కాని కారు ముందు చక్రం ఆమె మీద....

....ఆ నెత్తురు....ఆ వీధిమీద ఆ ఎర్రని నెత్తురు నాదే....నా ప్రాణందే....దేవుడా.... దెయ్యమా....కసాయివాడా....

నా తల్లి ప్రాణానికేమీ కాలేదు.... అమ్మయ్య దేవుడా కరుణామయుడా.... భయంతో ఎట్లా బిగుసుకుపోయి వుందోయ్ పెంచలూ....

పదండి ఆస్పత్రికి....పదండి ముందుకు
పదండి పైపైకి....పదండి తోసుకు
ఎముకలు విరిగిన
గుండెలు చచ్చిన
పెంచలయ్యలూ పదండి ఆస్పత్రికి....
కార్లవాళ్ళు కార్లాపలేదు.
టాక్సీలవాళ్ళు టాక్సీలాపలేదు.

సినిమాల కేగుతున్న, బజారు నుంచి వస్తున్న వేలాది నాగరీకులిటు చూడనయినా లేదు.

బస్సులనే జంతువులు బర్ బర్ మంటూ దూసుకుపోతున్నాయి. వెంకయ్యో,వీరయ్యో, ఎవరో రిక్షా మాట్లాడి కూచోపెట్టారు తన ఒడిలో .... మగతగా .... నిద్రగా .. అమ్మో అయ్యో....నొప్పి....నెత్తురు ముద్దగా .... నాన్నో .... కళ్ళు తెరుస్తూ మూస్తూ.... అరుస్తూ....అయ్యో .... అయ్యో....బంగారు తల్లీ.... ఆ దుర్మార్గ దేవడమ్మా.... నా ప్రాణమా....నేనేమి చేతునమ్మా నేనేమి చేతును....

ఆస్పత్రి చేరారు.

సుబ్బి తల్లిని లోపలికి....తెల్లటి గోడల లోలోపలికి తీసుకువెళ్ళి గంటయింది.

ఆ గంటసేపూ—
ఆ అరవై నిముషాలూ—
ఆ అరవై కాలయుగాలూ—
కాలు కాలిన పిల్లిలా—
కళ్ళు పోయిన కబోదిలా—
చచ్చిన మనిషిలా—
శాంతించని ఆత్మలా—

పడి వున్నాడు పెంచలయ్య—పడిగాపులు గాచాడు పెంచలయ్య—పది వేల మొక్కులు మొక్కుకున్నాడు పెంచలయ్య.

క్షణానికో సందేహం.
నిముషానికో భయం.
కొత్త కొత్త చీకట్లు.
అంతులేని అగాధాలు

అమ్మా....పార్వతీదేవీ అయ్యా రామచంద్రమూర్తీ—సాయిబాబా – వెంకటేశ్వరా నా బిడ్డను కాపాడండి నాయనా కాపాడండి.

రెండు గంటల తర్వాత నర్సు వచ్చింది. చెప్పింది.

మీ అమ్మాయికి ప్రాణభయం లేదు.... తొడ ఎముక విరిగింది. ముంజేతి ఎముక వంగింది. ఫోటో తీసి చూశారు. ప్లాస్టర్ వేశారు. రెండు నెలలపాటు అలాగే పడుకుని వుండాలంతే ఆ తర్వాత అన్నీ సరిగా అయిపోతాయి. భయపడకు....అధైర్యపడకు....

ఆ తల్లికి దండు పెట్టాడు పెంచలయ్య

లోపలికి తీసుకువెళ్ళి చూపించింది నర్సు.

సుబ్బి తల్లినా ప్లాస్టర్‌లో చూడగానే బావురుమన్నాడు పెంచలయ్య నర్సు తిట్టింది.

డాక్టరుబాబు చెప్పాడు—ఏమీ ఫరవాలేదు....లేత ఎముకలు అతి సులభంగా అతుక్కుంటాయి....బెంగ పెట్టుకోకు....

బంగారపు మెరుపువంటి బిడ్డ....లేడిలా గెంతే పిల్ల....పక్షిలా....మగతలో....మధ్య మధ్య నొప్పికి మూలుగుతూ....

కడుపులో చిచ్చు....

ఈ పిల్ల కాలు సరిగా వచ్చేనా....

కుంటిది కాదుకద దేముడా—రాముడా—దేముడా

ఆ రాత్రి అమ్మాయిని ఆస్పత్రిలోనే వదిలి ఇంటికి వచ్చాడు పెంచలయ్య.

సీతాలికి అప్పుడే అందింది వార్త. గుండెలు బాదుకుంది. ఇరుగు పొరుగు ఆడవాళ్ళు సముదాయిస్తున్నారు. అంత నొప్పిలోనూ నడవడానికి లేచి నడవలేక పడబోయింది. ఆస్పత్రికి వెళ్ళకుండా ఆమెనాపడం కష్టమయిపోయింది.

పిట్ట మీద పిడుగు—పిడుగు నెత్తిన భూకంపం—భూకంపానికితోడు కార్చిచ్చు—

కార్చిచ్చు క్రింద, భూకంపం మధ్యను పిడుగుకు అడుగున—అట్టడుగున పెంచలయ్య పిట్ట.

భయం....దుఃఖం .... కోపం....కసి.... నిరాశ....ఆశ .... అల్లకల్లోలం తర్వాత

శూన్యం....అంతా ఖాళీగా వుంది....నిర్వాణం సమాధి....

ఆ రాత్రి పదిగంటల వేళ—

—వారి గుడిసె ముందు టార్చి లైటు....

'పెంచలయ్యా!''—మేస్త్రి కేక

అదిరిపడి లేచి పరుగెత్తుకొచ్చాడు పెంచలయ్య!

మేస్త్రితో బాటు కంట్రాక్టరు గారితో బాటు ఇంకోబాబుగారున్నారు తెల్లగా, ఖరీదయిన బట్టలలో.

''పెంచలయ్యా....బాబుగారు పెద్ద ఇంజనీరుగారు సాయకాలం బాబుగారి—అబ్బాయి కార్లో వెళ్తుంటే అడ్డొచ్చిందిట సుబ్బి....'' పెంచలయ్యా కళ్ళల్లో కత్తులు....

''దొరగారిది వెన్నలాటి మనసు.... ఆయన సాయిత్రం నుండీ ఎంత బాధపడుతున్నారు....కుమిలిపోతున్నారు...ఆస్పత్రిలో పెద్ద డాక్టర్‌గారితో ఫోను మీద మాట్లాడారు సుబ్బికి ఏమీలోటు లేకుండా చూడమని చెప్పారు. సుబ్బికి ప్రాణభయం బొత్తిగా లేదు ఈ రెండు నెలలపాటు సుబ్బి తాలూకు ఆస్పత్రి ఖర్చులు ఎంతయినా సరే ఆయనే ఇస్తానన్నారు....నువ్వు కష్టాల్లో వున్నావని తెలిసి బాబుగారు....''అని మేస్త్రి ఆగి చూశాడు.

''పెంచలయ్యా....ఇంద....ఇదివుంచు''

ఆ తెల్లటి పొడుగాటి ఇంజనీరు బాబుగారి చేయి—

నల్లటి, చిన్నపాటి కూలిగాడు పెంచలయ్య చేయి—

తెల్లచేయి తేలికయింది.

నల్లచేయి బరు వెక్కింది

కవరు చేతులు మారింది

కవర్లో అయిదు వందల రూపాయలు.

''ఉంచు పెంచలయ్యా వుంచు....ఇంకా కావాలంటే చెప్పు....''

''ఇంకా ఏముంది దొరా తమరు ధర్మాత్ములు—ఈ మాత్రం చేశారు—''అన్నాడు కంట్రాక్టరు.

విస్తుపోయి నిల్చున్నాడు పెంచలయ్య.



కవరుని గట్టిగా పట్టుకుని వున్నాయి వేళ్ళు

మేస్త్రి, కంట్రాక్టరు, ఇంజనీరు వెళ్ళిపోయారు....

గుడిసెలో పలికి అడుగు పెట్టాడు పెంచలయ్య.

చేతిలోని కవరు చూశాడు పెంచలయ్య

కవరులోని రూపాయిలు చూశాడు పెంచలయ్య

రూపాయల బలం విద్యుత్తయి పరకాయ ప్రవేశం చేసింది.

పెంచలయ్య మనసు హుంకరించింది....

ఒకా పరేషనేమిటి రెండు చేయించవచ్చును.

ఇద్దరు డాక్టర్లను పిలించ వచ్చును

నాసీతాలు నొప్పినిట్టే మాయం చేయించవచ్చును.

''నిజంగా ఆ దేవుడు చల్లని వాడు—''

అనుకున్నాడు పెంచలయ్య.

''నిజంగా దేవుడు చల్లనివాడు.... ఆ కంట్రాక్టరు చెప్పి—అయిదు వందలతో సర్దేశాడు....కాని పోలీసు కేసయితే ఎన్ని వేలవునో....ఎంత అప్రతిష్ఠవునో....'' అనుకున్నాడు ఆరుమైళ్ళ వతల ''శాంతినిలయం' లో ఇంజనీర్ వెంకటాద్రిగారు.

ఇంతకూ

ఆ

చల్లనివాడు—,—?